సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం। 14। ఆగస్టు। 2024



నాణ్యమైన బోధన అందించాలి
ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. 8లో



విద్యార్థుల ఘర్షణపై విచారణ
జి.మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థుల మధ్య మళ్లీ జరిగిన ఘర్షణపై విచారణ నిర్వహించారు. 8లో



హామీలన్నీ నెరవేర్చాలి
ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐకేఎంఎస్ జాతీయ నాయకురాలు టాన్యా డిమాండ్ చేశారు. 8లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్సకు అభినందనలు



బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ తనూజరాణి, ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు

సాక్షి,పాడేరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు మంగళవారం విశాఖలో మర్యాదపూర్వకంగా కలిశారు. అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి, ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, జిల్లా అధ్యక్షుడు ఎల్‌బీ కిరణ్‌కుమార్, విద్యార్థి విభాగం నాయకుడు పోలిరెడ్డి సురేష్‌కుమార్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పెదలోచలి ఉపాధ్యాయుడి సస్పెన్షన్

- మద్యం తాగి విధులకు హాజరుకావడంతో చర్యలు

జి.మాడుగుల: మద్యం తాగి విధులకు హాజరైన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు (సోషల్ అసిస్టెంట్)ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండంలోని పెదలోచలి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఈ నెల 8వ తేదీన ఏటీడబ్ల్యూవో తిరిపాల్ తనిఖీ నిర్వహించారు. ఈ సమయంలో ఉపాధ్యాయుడు ఎస్.అప్పలకొండ మద్యం సేవించి భోజనశాలలో పడుకుని ఉన్నారు. ఈ విషయాన్ని గమనించిన ఏటీడబ్ల్యూవో ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో ఉపాధ్యాయుడిపై సమగ్ర విచారణ నిర్వహించారు. విచారణ నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుడు అప్పలకొండను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే పాఠశాలలో వారం రోజుల క్రితం హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం తెలిసిందే.

ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ అధికారిగా విజయలక్ష్మి



అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వై. విజయలక్ష్మి ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తమ జాతీయసేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రోగ్రాం అధికారిణిగా ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్ తెలిపారు. ఆమెను పలువురు అభినందించారు.

గౌరీశంకరరావుకు..



సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడు, ఎన్ ఎస్ఎస్–2 పీవో జి. గౌరీశంకరరావును ఉత్తమ ఎన్ఎస్ఎస్ పీవోగా ఆంధ్రా యూనివర్సిటీ ఎంపిక చేసింది. ఆయనను ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టిబ్బాయి అభినందించారు.

నష్టపరిహారం అందించి ఆదుకోవాలి

- సీపీఎం రాష్ట్రవర్గ సభ్యుడు మంతెన సీతారాం



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

చింతూరు: ఇటీవల నాలుగు మండలాల్లో సంభవించిన వరద కారణంగా సంభవించిన నష్టంపై తక్షణమే సర్వేచేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్రవర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. మంగళవారం చింతూరులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరదలకు ఇళ్లు ముంపునకు గురై బాధితులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. పనులు లేక రెండు వారాలపాటు ఉపాధి కోల్పోయారన్నారు. ప్రభుత్వం చెల్లించిన రూ.3 వేలు ఇళ్లుఖాళీ చేసేందుకు, తిరిగి ఇళ్లకు చేరేందుకు ఖర్చయ్యాయన్నారు. ముంపునకు గురైన ఇళ్లను సర్వేచేసి నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, పల్లపు వెంకట్, మట్ల వాణిశ్రీ, సీసం సురేష్, నాగేశ్వరరావు, చినబాబు పాల్గొన్నారు.





వందేమాతరం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వంద మీటర్ల జాతీయ జెండాతో మంగళవారం పాడేరు వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటర్‌లో విద్యార్థులు నిర్వహించిన ఈ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశభక్తిని చాటేలా విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారావు, పలువురు నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – సాక్షి, పాడేరు

తొలి మంగళవారమే ఆశా డే నిర్వహించాలి

- ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీవాణి డిమాండ్

చింతూరు: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతినెలా తొలి మంగళవారం మాత్రమే ఆశా డే సమావేశం నిర్వహించాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల శ్రీవాణి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె చింతూరులో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని తులసిపాక పీహెచ్‌సీలో రెండో మంగళవారం ఆశాడే సమావేశాన్ని నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆమె తెలిపారు. వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆశావర్కర్లను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ పద్ధతి మార్చుకోకుంటే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు.

సత్వర వైద్యం.. దూరం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులు సత్వర చికిత్సకు దూరమవుతున్నారు. దీనివల్ల అర్ధరాత్రి వేళ అనారోగ్యానికి గురైతే సమీప ఆస్పత్రులకు ఆశ్రమ పాఠశాల సిబ్బంది తరలించాల్సి వస్తోంది. హెల్త్ వలంటీర్లను నియమిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినా కార్యరూపం దాల్చకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.



దోమతెరలు లేని పాడేరు తలారిసింగి ఆశ్రమ పాఠశాలలోని సిక్ రూమ్



పాడేరు జిల్లా ఆస్పత్రిలో పలు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు

- గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నియామకానికి నోచుకోని హెల్త్ వలంటీర్లు
- అనారోగ్యానికి గురైన విద్యార్థులకు అందని అత్యవసర చికిత్స
- సమీప ఆస్పత్రులకు తరలిస్తున్న సిబ్బంది
- అమలుకాని సీఎం చంద్రబాబు హామీ



పాడేరు జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న తలారిసింగి ఆశ్రమ విద్యార్థి

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధుల ప్రభావం కనిపిస్తోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లు లేకపోవడంతో అనారోగ్యానికి గురైన విద్యార్థులకు సత్వర వైద్యం అందడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల వార్డెన్లు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది వారిని హుటాహుటిన ఆటోలు, ఇతర వాహనాల్లో సమీప ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్ల నియామకాలు చేపడతామని గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజుల్లో గుమ్మడి సంధ్యారాణి ప్రకటించారు. క్యాబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు కూడా హెల్త్ వలంటీర్లను నియ మిస్తామని చెప్పినా కార్యరూపం దాల్చలేదు. జిల్లా లోని 204 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఒకటి నుంచి టెన్త్ వరకు 78,357 మంది విద్యార్థులు ఉన్నారు. ఒకొక్క పాఠశాలకు ఒకొక్కరు చొప్పున హెల్త్ వలంటీర్లు ఉండాలి. అయితే వీరు లేకపోవడం వల్ల ప్రాథమిక చికిత్సకు వీరు దూరమవుతున్నారు.

సిక్ రూమ్‌లున్నా..

జిల్లాలోని 204 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో అనారోగ్యంతో బాధపడే విద్యార్థులకు ప్రత్యేకంగా ఒక గది కేటాయించి సిక్‌రూమ్ నిర్వహిస్తున్నారు. వీటిలో కూడా దోమ తెరలు లేవు. కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ నుంచి గత కొన్నేళ్లుగా పంపిణీ నిలిచిపోయింది. దీనివల్ల దోమకాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారు.

- రాజవొమ్మంగి ప్రాంతంలోని ఆశ్రమ పాఠశాలలో ఓ విద్యార్థి మలేరియా బారిన పడ్డారు. విద్యార్థులందరికీ రక్తపరీక్షలు నిర్వహించడంతో మలేరియా పాజిటివ్ వెలుగు చూసింది. చాలా ఆశ్రమ పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉన్నా గోప్యంగా ఉంచుతున్నందున వివరాలు వెలుగు చూడటం లేదు.

హెల్త్ వలంటీర్లను నియమించాలి



అనారోగ్యానికి గురైతే ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. పాఠశాలలో హెల్త్ వలంటీర్లు లేకపోవడంతో సకాలంలో ప్రాథమిక వైద్యం అందక ఇబ్బంది పడుతున్నాం. వెంటనే వారిని నియమించి సత్వరసేవలు పాఠశాలల్లో అందుబాటులో ఉంచాలి. – పాంగి చందుబాబు, టెన్త్ విద్యార్థి, తలారిసింగి పాఠశాల, పాడేరు

ప్రభుత్వానికి నివేదించాం




హెల్త్ వలంటీర్ల నియామకాలపై ప్రభుత్వానికి నివేదించాం. ఆశ్రమ పాఠశాలల్లోని సిక్‌రూమ్‌లలో దోమతెరలు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.అనారోగ్య సమస్యలకు గిరిజన విద్యార్థులు గురైతే సమీప ఆస్పత్రులకు తరలించేలా ఆశ్రమ నిర్వాహకులను అప్రమత్తం చేస్తున్నాం. – ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

సమగిరి కొండపై రంగురాళ్ల తవ్వకాలు



గెడ్డలో రంగురాళ్లను శుభ్రం చేస్తున్న గిరిజనులు



తవ్వకాల్లో బయటపడిన రంగురాళ్లు

- వారంలో రూ.10 లక్షల వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

చింతపల్లి: మండలంలోని గొందిపాకల పంచాయతీ సమగిరి కొండపై వారం రోజులుగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నాయి. సుమారు రూ.10 లక్షల వరకు వ్యాపారం జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. ఓ గిరిజన రైతు పొలానికి అనుకొని ఉన్న కొండపై పది రోజుల క్రితం రంగురాళ్లు బయటపడ్డాయి. నర్సీపట్నం, లోతుగెడ్డ వ్యాపారులకు రూ.వెయ్యి, రూ.500 చొప్పున అమ్మకాలు జరిపారు. ఇవి మేలు రకపు క్యాట్స్‌ఐ రంగురాళ్లగా గుర్తించారు. దీంతో తవ్వకాలు జరిగేలా గిరిజనులను ప్రోత్సహిస్తూ వ్యాపారులు సమగిరికి క్యూ కడుతున్నారు. తవ్వకాలపై విస్తృత ప్రచారం జరుగుతున్నా అటవీ, రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గిరిజన కూలీలను పెట్టుకొని రాత్రి వేళలో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. రంగురాళ్లు లభ్యమైన భూమి డి–ఫారం పట్టా కావడంతో అధికారులు చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది.

సొరంగంగా మారే ప్రమాదం

తవ్వకాలు ఒకే మార్గంలో జరపడం వల్ల సొరంగం మాదిరిగా ఏర్పడే అవకాశం ఉంది. మేలు రకం రంగురాళ్లు లభిస్తాయన్న ఆశతో వ్యాపారులు మరింత లోతుగా తవ్వకాలు జరిపేలా కూలీలను ప్రోత్సహిస్తున్నారు. దీనివల్ల సొరంగం కూలిపోయే అవకాశం ఉంది. గతంలో సిగనాపల్లి క్వారీలో సొరంగం మార్గంలో మట్టిపెళ్లలు విరిగిపడి గిరిజనులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా సత్వర చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమగ్ర ప్రణాళికతో మౌలిక సదుపాయాల కల్పన

తిరువనంతపురంలో కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్



వర్క్‌షాప్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లాకు చెందిన అధికారులు

సాక్షి,పాడేరు: పీఎం గతిశక్తి ప్రాజెక్ట్‌కు ఐదు దక్షిణాది రాష్ట్రాల కలెక్టర్లు, ఇతర అధికారులకు కేరళలోని తిరువనంతపురంలో మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో జిల్లా నుంచి కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని సమీకృత మౌలిక సదుపాయాల ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పీఎం గతిశక్తి పథకంతో సమగ్రమైన ప్రణాళిక ద్వారా మౌలిక సదుపాయాల కల్పన వేగవంతమవుతుందని ఆయన తెలిపారు. కలెక్టర్‌తో పాటు జిల్లాలోని డీఎఫ్‌వో వినోద్‌కుమార్, డీఎల్‌డీవో శాంతలక్ష్మి, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, జిల్లా పరిశ్రమల అధికారి వనిధర్, పీఆర్ ప్రాజెక్ట్స్ డీఈఈ మధు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి



వితంతువులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి, పాడేరు: వితంతు పింఛన్లకు అర్హులైన వారంతా గ్రామ సచివాలయాల్లోనే దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సూచించారు.మంగళవారం స్థానిక జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో సెర్ప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన వితంతు పింఛన్ల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సామాజిక పింఛన్ల కోసం సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్‌ను సంప్రదించాలన్నారు. భర్త మృతిచెంది ఉంటే వెంటనే రేషన్‌కార్డులో ఆపేరు తొలగించి వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పది ఎకరాల మెట్టభూమి, మూడు ఎకరాల పల్లపు భూమి ఉంటే సామాజిక పింఛన్‌కు అర్హులు కారని ఆయన తెలిపారు. మండల కేంద్రంలో వారపుసంత రోజున ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై అవగాహన, ఇతర సమస్యలు తెలుసుకునేందుకు మీకోసం కార్యక్రమం నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ మురళీ, ఎంపీడీవో సాయినవీన్, మండల విస్తరణాధికారి డి.రమేష్, ఏపీఎం ప్రసాద్‌న్యాయవాదులు ప్రసాద్‌నాయుడు, అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల ఘర్షణపై విచారణ

జి.మాడుగుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలుర వసతి గృహంలో ఇటీవల విద్యార్థుల మధ్య ఘర్షణపై మంగళవారం ఏటీడబ్ల్యూవో తిరిపాల్ విచారణ నిర్వహించారు. వసతి గృహంలోని విద్యార్థుల్లో కొంతమంది వ్యసనాలకు బానిసై గత నెలలో గొడవ పడ్డారు. దీనిపై కలెక్టర్ ఆదేశాల మేరకు పాడేరు డిప్యూటీ కలెక్టర్ శర్మ విచారణ నిర్వహించారు. అయితే ఇటువంటి సంఘటన మళ్లీ జరగదని, బుద్ధిగా చదువుకుంటామని, చెడు వ్యసనాల జోలికిపోవని, నడవడిక మార్చుకుంటామని విద్యార్థులు ఆయన సమక్షంలో అంగీకరించారు. ఇది జరిగిన వారం రోజులు కాకముందే అదే వసతి గృహంలో విద్యార్థుల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత ఉన్నతాధికారులు ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేసి నివేదిక అందించాలని ఏటీడబ్ల్యూవోను ఆదేశించారు. ఈ మేరకు ఆయన కళాశాల వసతి గృహంలో మంగళవారం ఏటీడబ్ల్యూవో తిరిపాల్ విచారణ చేశారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

చేప పిల్లల పంపిణీ

పాడేరు: చేప పిల్లల పెంపకం ద్వారా ఆర్థిక ఆసరా పొందవచ్చని, గిరిజన రైతులు దీనిపై ఆసక్తి చూపాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి తమర్బ బాబూరావు నాయుడు సూచించారు. సబల్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని దోకులూరు గ్రామంలో మంగళవారం వాసన్, రెయిల్ ఫారెస్ట్, అయలెన్స్ సంస్థలు సంయుక్తంగా గిరిజన రైతులకు చేపల పెంపకం, అడవుల సంరక్షణ, ఆర్గానిక్ సర్టిఫికేషన్‌పై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. సబ్ ప్రాజెక్టు ప్రోగ్రాం ఆఫీసర్ నాయుడు మాట్లడుతూ ఏజెన్సీలో ఇప్పటి వరకు 400 మంది గిరిజన రైతులకు చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం పలువురు గిరిజన రైతులకు చేప పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు భాస్కర్, సన్ని, వినూత్న, రమేష్, గిరిజన రైతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై వీడియో కాన్ఫరెన్స్

మహారాణిపేట: స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 షెడ్యూల్ విడుదలపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. మంగళవారం విశాఖ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తదితరులు పాల్గొని జిల్లా ఓటర్ల నమోదు వివరాలను తెలిపారు.

జామగుడ ఆశ్రమ హెచ్‌ఎంకు షోకాజ్


విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్


బోర్డులో విద్యార్థిని పాఠలను పరిశీలిస్తున్న పీవో, డీడీ


దుంబ్రిగుడ పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

- గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పీవో అభిషేక్
- డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయులు లేకపోవడంపై ఆగ్రహం
- వారికి కూడా నోటీసులు జారీ చేయాలని ఆదేశం

దుంబ్రిగుడ: జామగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, ఉపాధ్యాయులకు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ షోకాజ్ నోటీసు ఇచ్చారు. మంగళవారం ఆయన మండలంలో విస్తృతంగా పర్యటించారు. దీనిలో భాగంగా ఆయన జామగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సమయంలో హెచ్‌ఎం సుజాత, ఇన్‌చార్జి డిప్యూటీ వార్డెన్ కె.లక్ష్మి, ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావును ఆదేశించారు. వారి నుంచి రెండురోజుల్లోగా సమాధానం రావాలని సూచించారు. టెన్త్ విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో పాఠ్యాంశాలను బోధించారు. అనంతరం సావ్వా ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు సోషల్ సబ్జెక్టులో పాఠం బోధించారు. అసిస్టెంట్ ఇంజనీరు అభిషేక్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం తగదు

గర్భిణీలకు పౌష్టికాహారం అందివ్వడంలో అలసత్వం వహిస్తే వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ నెలలు నిండిన గర్భిణులతో ఆప్యాయంగా మాట్లాడాలన్నారు. వారికి క్రమం తప్పకుండా గుడ్లు, పాలు అందివ్వాలని వైద్యాధికారి అంబికరమణిని ఆదేశించారు. వార్డులను పరిశీలించిన ఆయన రోగులతో మాట్లాడారు. ల్యాబ్‌లో రికార్డులను పరిశీలించారు. జనవరి 2024 నుంచి మలేరియా జ్వరాల వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 26 మలేరియా, ఒక డెంగ్యూ కేసు నమోదు అయ్యిందని సిబ్బంది ఆయనకు వివరించారు. రూ.50 లక్షలతోనిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ని పరిశీలించారు. వెంటనే వినియోగంలోకి తేవాలని ట్రైబల్ వెల్ఫేర్ జేఈని ఆదేశించారు. అనంతరం అరమ పంచాయతీలో గొల్లంబో రహదారి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీడీ కొండలరావు, టిడబ్ల్యూ ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.

జీవన, సేంద్రియ ఎరువులతో అధిక దిగుడులు

జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రదీప్‌కుమార్


క్రిమిసంహారక మందుల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న ప్రదీప్‌కుమార్


వరి పంటలో తెగుళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఏవో

పెదబయలు: జీవన, సేంద్రియ ఎరువుల వినయోగం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత డాక్టర్ పి.ప్రదీప్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి ఎ.శ్రీనివాస్ తెలిపారు. వనభంగి పంచాయతీ తోటలగొండిలో చిరుధాన్యాల చెల్లెళ్ల సంఘం సభ్యులు 30 మందికి 14 వారాల పాటు శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం కలిగే అనర్థాలను వివరించారు. స్థానికంగా పశువుల ద్వారా లభ్యమయ్యే పేడ, మూత్రంతో సేంద్రియ ఎరువులను తయారు చేసి, వినియోగించడంతో మేలు జరుగుతుందని చెప్పారు. గ్రామంలోని పంటపొలాల్లో ఆకు గొంగలి పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్టు గుర్తించి, దీని నివారణ కోసం బ్రహ్మాస్త్రం తయారు చేసి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకులు కె.జానకీరాం, ఎఫ్‌పీవో విజయ లక్ష్మి,చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాంత కుమారి మహిళ రైతులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి

ఐటీడీఏ పీవో అభిషేక్, డిప్యూటీ కలెక్టర్ శర్మ ఆదేశం


ఐటీడీఏ పీవో అభిషేక్ డిప్యూటీ కలెక్టర్ శర్మలకు వినతి పత్రం అందిస్తున్న గిరిజన సంఘం నేతలు

హుకుంపేట: అక్రమ నిర్మాణాలు జరగకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డిప్యూటీ కలెక్టర్ శర్మ ఆదేశించారు. అక్రమ నిర్మాణాలపై గిరిజన సంఘం నాయకులు ఇటీవల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పీవో, డిప్యూటీ కలెక్టర్ మంగళవారం హుకుంపేటను సందర్శించారు. కామయ్యపేట జంక్షన్‌లో గిరిజనేతరులు ఇటీవల నిర్మించిన ఇళ్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమ నిర్మాణాలు ఆపాలంటూ గిరిజన సంఘం నాయకులు తాపుల కృష్ణారావు తదితరులు అధికారులకు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో సుమారు 12 మంది వరకు గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంపై స్థానిక రెవెన్యూ అధికారులతో పాటు సంబంధిత ఉన్నత అధికారులకు పలు మార్లు వినతులు అందించామని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పీవో,డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ మండల కేంద్రం హుకుంపేటలో అక్రమ నిర్మాణాలు జరగకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరిగితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

10 ఎన్‌ఆర్‌ఎస్‌టీసీలకు 68 దరఖాస్తులు

కొయ్యూరు: పాఠశాలలు లేనిచోట్ల ఏర్పాటు చేయనున్న ఎన్‌ఆర్‌ఎస్‌టీసీలకు సంబంధించి 68 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం పది కేంద్రాలను మండలంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం టెట్,బీఈడీ,డీఈడీ చేసిన అభ్యర్థులు దరఖాస్తులు చేశారు. వైఎస్ పాకల, జోటంపేటకు 11 మంది చొప్పున దరఖాస్తు చేశారు.గంపరాయికి 12 మంది దరఖాస్తు చేశారు. మెరిట్ ఆధారంగా నియామకాలు ఉంటాయని ఎంఈవో ఎల్. రాంబాబు మంగళవారం తెలిపారు.అభ్యర్థుల జాబితాను డీఈవోకు అందజేస్తామన్నారు. ఆయన పరిశీలించి నియామక ఉత్తర్వులు ఇస్తారని చెప్పారు.మంగళవారంతో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగిసిందని ఎంఈవో తెలిపారు.

అంగన్‌వాడీల నిరసన


ముంచంగిపుట్టులో నిరసన చేస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీలను విస్మరించారని ఆరోపించారు. హామీలను అమలు చేయని పక్షంలో సమ్మె చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్,అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి,మౌలమ్మ,ఈశ్వరి, సుజాత పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన అందించాలి

హెచ్‌ఎంలకు డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశం

జి.మాడుగుల: పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల నిర్వహణ కమిటీలు సక్రమంగా పనిచేయాలని, స్వాతంత్ర్య దినోత్సవాలన్ని ఘనంగా పాఠశాలలో నిర్వహించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపాలని ఆయన సూచించారు. యూ-డైస్ నిర్వహణ, ఉపాధ్యాయులు హాజరు, విద్యార్థులందరు పాఠశాలలో ఉండేలా దృష్టి సారించాలని ఆయన సూచించారు. పాఠశాలలో విద్యార్థులందరికీ విద్యా కిట్లు అందించాలని మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ వహించడమే కాకుండా, నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎంఈవో సీహెచ్ బాబూరావుపడాల్, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

80 కిలోల గంజాయి పట్టివేత

నలుగురి అరెస్టు


గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పోలీసులు వేర్వేరు కేసుల్లో 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చింతూరు సీఐ గజేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం మోతుగూడెం చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా రాష్ట్రం కెందుగూడెం గ్రామం నుంచి ఖమ్మం తరలిస్తున్న 20 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేసి, బైకును స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో ఒడిశా రాష్ట్రం నెమలి గూడెం గ్రామం నుంచి భద్రాచలానికి 60 కిలోల గంజాయిని తరలిస్తుండగా ఇద్దరిని అరెస్టు చేసి, గంజాయితో పాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు ఈ రెండు కేసుల్లో మొత్తం 80 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని రిమాండ్‌కు తరలించినట్టు చింతూరు సీఐ గజేంద్ర, మోతుగూడెం ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు. పరారైన ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. పాత గంజాయి కేసుల్లో ఇద్దరు నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్టు వారు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

జేసీ అభిషేక్‌గౌడ్‌కు ప్రభుత్వ మద్యం దుకాణ ఉద్యోగుల డిమాండ్


జేసీ అభిషేక్‌గౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

సాక్షి, పాడేరు: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్, సబ్ కలెక్టర్ కార్యాలయాలకు చేరుకున్న వారు తమకు న్యాయం చేయాలని అధికారులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రెయ్యిల రాంబాబు మాట్లాడుతూ జిల్లాలోని 41 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 250 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, న్యాయం చేయాలని కోరారు. తమ ఉద్యోగాలపైనే కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, ఏ మాత్రం అన్యాయం జరిగినా, తమ కుటుంబాలన్నీ రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలకు ఇబ్బందులు కలిగిస్తే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. అనంతరం జేసీ అభిషేక్‌గౌడ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రమణ, బాలకృష్ణ, రామారావు, నారాయణ, నర్సింగ్, సంజీవ్, రవికుమార్‌లు తదితరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాలి

రంపచోడవరం : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఏఐకేఎంఎస్ జాతీయ నాయకురాలు పి.టాన్యా డిమాండ్ చేశారు. రంపచోడవరంలో మంగళవారం నిర్వహించిన ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు పథకాలను అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను కార్యవర్గ సభ్యులు ఆమోదించారు. ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల మేరకు పంద్రాగస్టు వేడుకలు

- మండల అధికారులతో జేసీ అభిషేక్ గౌడ్


హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ్, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు: ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను నిబంధల మేరకు నిర్వహించాలని జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు కలెక్టరేట్‌తో పాటు తలారిసింగి పెరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేసి, గౌరవ వందనం స్వీకరిస్తారని వెల్లడించారు. పెరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పెరేడ్ అనంతరం అన్ని శాఖల శకటాలు పాడేరు పురవీధుల్లో తిరగాలన్నారు. ఈ వీడియో సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య, డీఆర్వో పద్మావతి, ఎస్‌డీసీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విస్తృత ప్రచారం

జిల్లాలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణకు అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం నిర్వహించాలని, జేసీ అభిషేక్‌గౌడ్ ఆదేశించారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ విభాగం రూపొందించిన ప్రచార పోస్టర్లు, లోగోలను తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఎన్జీవోల సహకారంతో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు రాంచందర్, చిరంజీవి, పలు ఎన్జీవో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలిలో మృతి చెందిన భీమాచారి

పెందుర్తి: వేపగుంట–పినగాడి రహదారి చీమలాపల్లి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గోపాలపట్నం కుమారి కేటరింగ్‌లో పనిచేస్తున్న మొల్లేటి భీమాచారి(35), తమ్మిన సందీప్ బైక్‌పై పినగాడి వైపు వెళుతున్నారు. చీమలాపల్లి వద్దకు వచ్చేసరికి అదే సమయంలో చింతగట్లకు చెందిన గుడివాడ శ్యామ్ బైక్‌పై వస్తున్నాడు. రెండు బైక్‌లు బలంగా ఢీకొనడంతో సందీప్ బైక్ వెనుక కూర్చున్న భీమాచారి రోడ్డు పక్కన తుళ్లిపడడంతో తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మరణించాడు. సందీప్, శ్యామ్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని భీమాచారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతుంది.

తప్పలతడకగా గ్రామాల పేర్లు



రాకాసిరాయికి బదులుగా రాకాసిరారిగా ఉన్న గ్రామం పేరు



బల్లుగూడకు బల్లిగూడగా ఉన్న బోర్డు

ముంచంగిపుట్టు: గ్రామాల పేర్లతో ఏర్పాటు చేసిన బోర్డులు తప్పులతడకగా ఉన్నాయి. మండలంలోని కర్రిముఖిపుట్టు పంచాయతీ రాకాసిరాయి గ్రామం పేరును రాకాసిరారి అని,బాబుశాల పంచాయతీ బల్లుగూడ పేరును బల్లిగూడ అని బోర్డులపై రాశారు. దీంతో కొత్తగా ఆయా గ్రామాలకు వెళ్లేవారు ఆ పేర్లను చూసి తికమక పడుతున్నారు. అధికారులు స్పందించి పేర్లను సరి చేయాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

హోటళ్లలో ప్లాస్టిక్ నిషేధం

- అడ్డాకుల ప్లేట్లు,కప్పులే వినియోగించాలి
- ఐటీడీఏ పీవో అభిషేక్


గిరిజన మహిళలు తయారుచేసిన ప్లేట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని హోటళ్లలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలుజేసి, అడ్డాకులతో తయారుచేసిన ప్లేట్లు,కప్పులను వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఎంపీడీవోలను ఆదేశించారు. వన్‌ధన్‌యోజనలో భాగంగా వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అడ్డాకులతో ప్లేట్ల తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ప్లేట్లు, కప్పులను తయారు చేసిన గిరిజన మహిళలను అభినందించారు.ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అడ్డాకులతో తయారుచేసిన ప్లేట్లు,కప్పులను పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేయాలని,స్థానికంగా అన్ని హోటళ్లకు సరఫరా చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళీ,ఎంపీడీవో సాయినవీన్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ వైద్యులు విధుల బహిష్కరణ


జూనియర్ వైద్యుల ప్రదర్శన

మహారాణిపేట(విశాఖ): పశ్చిమ బంగాలో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీపై లైంగిక దాడి, దారుణ హత్యకు నిరసనగా కేజీహెచ్‌లో జూనియర్ వైద్యులు మంగళవారం విధులు బహిష్కరించారు. దీంతో ఆస్పత్రిలో వైద్య సేవలకు స్వల్ప అంతరాయం కలిగింది. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఓపీలను, వార్డులో రోగులను చూసే ప్రక్రియ నిర్వహించారు. జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, సెంట్రల్ హెల్త్ కేర్ ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూనియర్ వైద్యులు ఆందోళన చేపట్టారు. కేజీహెచ్,ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి మొదలైన ర్యాలీ వాచ్‌హౌస్, జగదాంబ, కలెక్టర్ కార్యాలయం మీదుగా తిరిగి మెడికల్ కళాశాలకు చేరుకుంది. ఆంధ్రా మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.పృధ్వీరాజ్, ఉపాధ్యక్షుడు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు.

కన్నతల్లి కర్కశత్వం

- వంటపాత్రలు శుభ్రం చేయలేదని కుమార్తెను చావబాదిన తల్లి
- తీవ్ర గాయాలతో పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీసిన బాలిక
- పెందుర్తి సీహెచ్‌సీలో చికిత్స, కేసు నమోదు

పెందుర్తి: ఆమె ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఆమె కన్నకూతురిపైనే దాష్టీకానికి పాల్పడింది. ఇంట్లో వంట పాత్రలు శుభ్రం చేయలేదని విచక్షణా రహితంగా చితకబాదింది. తల్లి కర్కశత్వానికి బెంబేలెత్తిన ఆ చిన్నారి ఇంటి నుంచి పరుగులు తీసి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన గోడు వెళ్లబోసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తిలోని సింహపురి కాలనీలో నివాసం ఉంటున్న స్వాతి సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. భర్తతో విభేదాల కారణంగా కుమార్తె(13)తో కలిసి ఉంటుంది. మంగళవారం ఉదయం ఇంట్లో వంట పాత్రలు శుభ్రం చేయమని కుమార్తెకు చెప్పింది. బాలిక వెంటనే ఆ పనిచేయకపోవడంతో కర్రతో చితకబాదింది. దీంతో మొహం, శరీరంపై తీవ్ర గాయాలు కావడంతో బాలిక భయంతో ఇంట్లో నుంచి పారిపోయి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. వెంటనే బాధితురాలిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు స్వాతిపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.